సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి
98490 98674
నంబర్‌ను సంప్రదించండి

సడలిస్తారా.. సరిపెడతారా!



గాజువాక హౌస్ కమిటీ ప్రాంతంలో నివాసాల క్రమబద్ధీకరణ ప్రక్రియ కొనసాగుతూనే ఉంది. ప్రభుత్వాలు మారుతున్నా, కొత్త జీవోలు వస్తున్నా సమస్య మాత్రం పరిష్కారం కాలేదు. ఎన్ని జీవోలు వచ్చినా అందులో నిబంధనల కారణంగా భూ బాధితులకు స్వాంతన చేకూరడంలేదు. మూడున్నర దశాబ్దాలుగా సాగుతున్న ఈ సమస్య పరిష్కారం పేరుతో వస్తున్న జీవోల్లో ఒకే విధమైన షరతులు విధించడంతో మళ్లీ మొదటికే వస్తోంది. ఈ సారైనా ఏవో సాకులు చూపి సాగదీయకుండా అందరికీ హక్కులు కల్పించాలని కోరుతున్నారు. – గాజువాక

- క్రమబద్ధీకరణ జీవో కటాఫ్ తేదీపై అసంతృప్తి
- నిబంధనలు సడలించాలని విన్నపాలు
- తేదీ మార్చాలంటున్న భూబాధితులు

హౌస్ కమిటీ పరిధిలో నివాసాల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం జీవో నంబర్ 45 జారీ చేసింది. ఈ జీవో ప్రకారం 2023 డిసెంబర్ 31వ నాటికి గల నివాసాలను క్రమబద్ధీకరిస్తారు. దీనికి సంబంధించి ఇప్పటికే దరఖాస్తుల ప్రక్రియ కూడా కొనసాగుతోంది. దరఖాస్తుదారులు తమకు సమీపంలో గల సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చు. గతంలో ప్రభుత్వం జారీ చేసిన జీవో 301 ప్రకారం పట్టాల కోసం డబ్బులు కట్టేసి పెండింగ్‌లో ఉన్నవాటికి ఇప్పుడు ఈ జీవో ప్రకారం జారీ చేస్తారు.

ఎన్నాళ్లు సాగదీత?

ఇదిలా ఉండగా, జీవో 45 ప్రకారం గాజువాక హౌస్ కమిటీ పరిధిలో నివాసాల క్రమబద్ధీకరణ కటాఫ్ తేదీని 2023 డిసెంబర్ 31గా నిర్ణయించడంపై బాధితులు పెదవి విరుస్తున్నారు. కటాఫ్ తేదీ మార్చితే బాగుండేదని పేర్కొంటున్నారు. హౌస్ కమిటీ పరిధిలో రోజురోజుకు నిర్మాణాలు పెరుగుతున్నాయని, ఈ నేపథ్యంలో కటాఫ్ తేదీని మార్చకుండా ఈ సమస్యను ఎన్నాళ్లు సాగదీస్తారంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చార్జీలు ఇలా

క్రమబద్ధీకరణ జీవో 45 ప్రకారం 100 చదరపు గజాల లోపు స్థలంలోని నిర్మాణాలను ఉచితంగా క్రమబద్ధీకరిస్తారు. 101 నుంచి 200 చదరపు గజాల లోపు విస్తీర్ణంలో నిర్మాణాల క్రమబద్ధీకరణకు చదరపు గజం రూ.50 చొప్పున, 201 నుంచి 400 చదరపు గజాల వరకు చదరపు గజానికి రూ.120 చొప్పున, 401 నుంచి 1000 చదరపు గజాల వరకు చదరపు గజానికి రూ.1000 చొప్పున చెల్లించి క్రమబద్ధీకరణ పట్టా పొందవచ్చు. ఇవే విస్తీర్ణాల్లోని కమర్షియల్ నిర్మాణాలకైతే రెట్టింపు ధరలు చెల్లించాల్సి ఉంటుంది.

- 100 చదరపు గజాల వరకు గల స్థలాల్లో నిర్మాణాలను ఉచితంగా క్రమబద్ధీకరిస్తామన్న నిబంధనను సడలించాలని కోరుతున్నారు. ఉచిత క్రమబద్ధీకరణ వల్ల ఆస్తి బదలాయింపు హక్కు, బ్యాంకుల నుంచి రుణం పొందే హక్కు ఉండవు. కాబట్టి చదరపు గజానికి కనీస రుసుం విధించి క్రమబద్ధీకరణ చేయాలని కోరుతున్నారు.
- నిర్మాణాల క్రమబద్ధీకరణకు కటాఫ్ తేదీని 2023 డిసెంబర్ 31గా నిర్ణయించారు. ఈ తేదీ తర్వాత చాలా నిర్మాణాలు వచ్చాయి. ఇప్పుడు వాటిని పరిగణించకపోతే క్రమబద్ధీకరణ ప్రక్రియ అందరికీ ఫలితాన్నివ్వదనే వాదన వినిపిస్తోంది. అందువల్ల కటాఫ్ తేదీని 2024 డిసెంబర్ 31గా మార్చాలని కోరుతున్నారు. దీనివల్ల చాలామంది బాధితులు ఈ సమస్య నుంచి విముక్తి పొందుతారని పేర్కొంటున్నారు.
- క్రమబద్ధీకరణ పట్టాలను కుటుంబంలోని మహిళల పేరుతో ఇవ్వాలని ప్రభుత్వం పేర్కొనడంపై భూబాధితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిర్మాణాలకు సంబంధించిన రిజిస్టర్డు దస్తావేజులు ఎవరి పేరుమీద ఉంటే వారిపేరుతోనే క్రమబద్ధీకరణ పట్టాలు ఇవ్వాలని కోరుతున్నారు. కన్వేయన్స్ డీడ్ పద్ధతిని రద్దు చేసి పూర్తి హక్కులతో పట్టాలను జారీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

అందించాల్సిన డాక్యుమెంట్లు

గాజువాక హౌస్ కమిటీ భూముల్లో వెయ్యి గజాల లోపు స్థలాల్లో గల నివాస గృహాలను క్రమబద్ధీకరిస్తారు. దరఖాస్తుదారులు సంబంధిత కటాఫ్ తేదీనాటికి గల ఆస్తిపన్ను, విద్యుత్ కనెక్షన్‌తోపాటు రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు ఉంటే వాటిని కూడా అధికారులకు సమర్పించాల్సి ఉంటుంది. ఆస్తిపన్ను, విద్యుత్ బిల్లులో ఏదో ఒక డాక్యుమెంట్ ద్వారా దరఖాస్తుదారులు ఆ నివాసంలో ఉంటున్నట్టు తెలియజేయవచ్చు.

గెడ్డలు.. వాగులు ఎక్కడ?

జీవోలో షరతులపై అందరూ ఊహించినట్టే జరిగింది. గెడ్డలు, వాగుల పేరుతో కొన్ని ప్రాంతాల్లో క్రమబద్ధీకరణ దరఖాస్తులను గతంలో తిరస్కరించారు. తాజా జీవోలోనూ అవే షరతులను విధించడంతో మళ్లీ అవే ఇబ్బందులు తలెత్తుతాయని రెవెన్యూ వర్గాలు పేర్కొంటున్నాయి. గాజువాక ప్రధాన పట్టణంలో అత్యధిక భాగం గెడ్డలు, చెరువుల పరిధిలో ఉంది. గాజువాక పట్టణ పరిధిలో రెండు ప్రధాన చెరువులు, మూడు గెడ్డలు ఉన్నాయి. అవి రికార్డుల్లోనే తప్ప క్షేత్రస్థాయిలో కనిపించవు. ఇప్పటికే ఈ ప్రాంతంలో పూర్తిస్థాయి నిర్మాణాలు వెలిశాయి. వాటికి ఆస్తి పన్నులు, నీటి కుళాయి పన్నులు కూడా చెల్లిస్తున్నారు. రికార్డుల్లో చెరువులు, గెడ్డలు ఉన్నాయన్న కారణంతో ఇప్పుడు ఆ నిర్మాణాలను తీసేసే పరిస్థితి లేదు. గెడ్డలు, కాలువలని పేర్కొంటున్న అనేక ప్రాంతాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. ఇన్ని కట్టడాలు ఉన్నప్పుడు ఈ ప్రాంతాల్లో ప్రభుత్వ ఎంజాయ్‌మెంట్ సాధ్యం కాదని అధికారులే చెబుతున్నారు. గతంలో పలు జీవోలొచ్చినప్పటికీ ఈ అడ్డంకులవల్లే పూర్తిస్థాయిలో ఫలించలేదు. మురుగునీరు, వర్షపునీరు వెళ్లడానికి వీలుగా జీవీఎంసీ గోడలు కట్టేసింది. పట్టణం రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. గత దశాబ్దకాలంగా గాజువాక నీట మునిగిన దాఖలాలు కూడా లేవు. అందువల్ల ఆ ప్రాంతాల్లో దరఖాస్తులను స్వీకరించి సర్వే నిర్వహించి క్రమబద్ధీకరిస్తే చాలామందికి మేలు జరుగుతుంది. ఈ ప్రాంతాల్లో నివాసాలను కూడా క్రమబద్ధీకరించాలని గతంలో రెవెన్యూ అధికారులు ప్రభుత్వానికి లేఖలు కూడా రాశారు.వాటిని పరిగణలోకి తీసుకొని అందరికీ హక్కులు కల్పించాలని కోరుతున్నారు.

నిబంధనలు సడలించాలి



గాజువాక హౌస్ కమిటీ పరిధిలో భవనాల క్రమబద్ధీకరణ కోసం ప్రభుత్వం జారీ చేసిన జీవో 45లో నిబంధనలను సడలిస్తే బాగుంటుంది. ఎక్కువ మందికి మేలు జరిగే విధంగా కటాఫ్ తేదీని 2024 డిసెంబర్ 31గా మార్చాలి. ఇప్పటికే అధికారులు, ఎమ్మెల్యేను కోరాను. వాగులు, గెడ్డల పేరుతో కొంతమందిని క్రమబద్ధీకరణకు దూరం చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితులను పరిశీలించి సర్వే చేసి వారికి కూడా న్యాయం చేయాలి. కనీస రుసుం విధించి అన్ని హక్కులతో క్రమబద్ధీకరణ చేయాలి.

– తుంపాల శ్రీరామ్మూర్తి, గాజువాక భూబాధితుల సంఘం సభ్యుడు

నిబంధనల ప్రకారం క్రమబద్ధీకరణ



జీవోలో పొందుపర్చిన నిబంధనల ప్రకారం క్రమబద్ధీకరణ చర్యలు ఉంటాయి. ఇప్పటికే ఈ ప్రక్రియను ప్రారంభించాం. వార్డు సచివాలయాల్లో దరఖాస్తులు స్వీకరిస్తున్నాం. ఇప్పటివరకు 348 దరఖాస్తులు అందాయి. అవి సర్వే దశలో ఉన్నాయి. దరఖాస్తు చేయనివారు కూడా త్వరితగతిన దరఖాస్తులు అందజేయాలి. క్రమబద్ధీకరణ కోసం 301 జీవో ప్రకారం గతంలో దరఖాస్తు చేసుకొని డబ్బులు చెల్లించినవారికి కూడా ఇప్పుడు క్రమబద్ధీకరణ చేస్తాం.

– టి.శ్రీవల్లి, గాజువాక తహసీల్దార్.

క్లుప్తంగా

విద్యార్థులకు ఆటల పోటీలు



పరుగు పందెంలో విద్యార్థులు

పెదగంట్యాడ: విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని నింపేందుకు క్రీడాపోటీలు దోహదం చేస్తాయని పెదగంట్యాడ శాఖా గ్రంథాలయ అధికారి పీవీ రమణ అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా శుక్రవారం శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. అలాగే వారితో కథల పుస్తకాలు చదివించారు. నీతి కథలు చదివించి అందులోని నీతిని వివరించారు. అనంతరం పరుగు పందెం పోటీలు నిర్వహించారు.

సమ్మె నోటీసు అందజేత



భెల్ ఈడీ సుబ్రమణ్యంకు సమ్మె నోటీసు అందజేస్తున్న కార్మిక నాయకులు

అక్కిరెడ్డిపాలెం: భెల్ ప్రొగ్రెసివ్ ఫ్రంట్ (ఇంటక్, సీటు) నాయకులు శుక్రవారం యాజమాన్యానికి సమ్మె నోటీసు అందజేశారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 20న దేశవ్యాప్తంగా సమ్మె చేయాలని జాతీయ కార్మిక సంఘాలు పిలుపు నిచ్చాయి. అందులో భాగంగా జాతీయ సమస్యలతో పాటు భెల్ సమస్యలపై సంస్థ ఈడి జి. సుబ్రమణ్యంకు సమ్మె నోటీసు ఇచ్చారు. కార్యక్రమంలో జి.టి.పి. ప్రకాశ్, సీతన్న నాయుడు, ఆర్. జనార్ధనరావు, పి. ఆనందకుమార్, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు ఫైనాన్స్ విభాగాధిపతికి అభినందనలు



స్టీల్‌ప్లాంట్ ఫైనాన్స్ నూతన విభాగాధిపతిని సత్కరిస్తున్న సీ నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఫైనాన్స్ విభాగాధిపతి హేమంత్ కుమార్ ఝాను ఉక్కు అధికారుల సంఘం (సీ) నాయకులు అభినందించారు. నూతన విభాగాధిపతిగా బాధ్యతలు స్వీకరించిన ఆయన్ను శుక్రవారం సీ నాయకులు కలిసి సత్కరించారు. నాలుగు నెలలుగా స్టీల్‌ప్లాంట్ మెరుగైన పనితీరు కనబరించిందని, కష్టాలు ఎదురైనా ఉద్యోగులు మంచి ఫలితాలు సాధించారన్నారు. కార్యక్రమంలో సీ అధ్యక్షుడు కాటం చంద్రరావు, ప్రధానకార్యదర్శి కె.వి.డి. ప్రసాద్, ఉపాధ్యక్షుడు టి. శ్రీనివాసరావు, కోశాధికారి పి. లోకేష్, సభ్యులు కె. ప్రశాంత నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌కు సత్కారం



కొమ్ము ప్రసాద్‌ను అభినందిస్తున్న కోక్ఓవెన్స్ విభాగాధిపతి దుర్గాప్రసాద్

ఉక్కునగరం: స్టీల్ ఐఎన్‌టీయూసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులైన కొమ్ము ప్రసాదరావును శుక్రవారం వివిధ విభాగాధిపతులు, కార్మిక సంఘాల నాయకులు సత్కరించారు. కోక్ఓవెన్స్ విభాగాధిపతి ఎం.వి.ఎస్. దుర్గాప్రసాద్ తదితరులు ప్రసాద్‌కు బొకే అందజేసి అభినందించారు. కార్యక్రమంలో గోపాలరాజు, తాండ్ర కనకరాజు, టి.వి.కె. రాజు పాల్గొన్నారు.

ఆర్టీసీ కాంప్లెక్స్‌లో విస్తృత తనిఖీలు



కళాసీలను ప్రశ్నిస్తున్న సీఐ ఎర్రంనాయుడు

అల్లిపురం: సీపీ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ఆదేశాల మేరకు టూటౌన్ పోలీసులు ఆర్టీసీ కాంప్లెక్స్‌లో శుక్రవారం రాత్రి విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ వీవీసీఎం ఎర్రంనాయుడు ఆధ్వర్యంలో ఎస్ఐ కాంతారావు సిబ్బందితో కలిసి అనుమానిత లగేజీలు, ప్రయాణికులను తనిఖీ చేపట్టారు. ఆర్టీసీ కాంప్లెక్స్‌లో గల సీసీ కెమెరాలు పరిశీలించారు.

ఆటో డ్రైవర్లకు చట్టాలపై అవగాహన



ప్రసంగిస్తున్న న్యాయమూర్తి షణ్ముఖరావు

గాజువాక: అసంఘటిత కార్మికుల హక్కులు, విధులు అవగాహన వారోత్సవాల్లో భాగంగా గాజువాక మండల్ లీగల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గాజువాక కోర్టు కాంప్లెక్స్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 13వ అదనపు జిల్లా జడ్జి జి.షణ్ముఖరావు మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు అత్యంత బాధ్యతాయుతంగా ఉండాలని సూచించారు. వాహనం నడిపేటప్పుడు మద్యపానం చేయవద్దన్నారు. ఆటోకు ఇన్సూరెన్స్ లేకుండా నడపవద్దని సూచించారు. ఇన్సూరెన్స్ లేని సమయంలో ఎలాంటి ప్రమాదం జరిగినా బాధితులకు డ్రైవర్లు తమ సొంత డబ్బుతో పరిహారం చెల్లించాల్సి ఉంటుందన్నారు. సెల్‌ఫోన్ డ్రైవింగ్‌కు దూరంగా ఉండాలన్నారు. దీనివల్ల అనేక అనర్థాలు జరిగే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ జి.సత్యనారాయణ, లేబర్ ఆఫీసర్ వై.నరేష్, బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు యశోధర వేదమణి, డి.చిరంజీవి, కోశాధికారి గిల్బర్ట్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అభయాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం



అన్న సమారాధనలో పాల్గొన్న దేవన్‌రెడ్డి తదితరులు

గాజువాక: జీవీఎంసీ 71వ వార్డు సుందరయ్య కాలనీ మన్నా ట్యాంక్ ఏరియాలోని మహా గణపతి, మహా సరస్వతి సమేత అభయాంజనేయస్వామి ఆలయ 10వ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశిష్ట పూజలు, ప్రత్యేక అభిషేకాలు చేశారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం నిర్వహించిన భారీ అన్న సమారాధనను వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి ప్రారంభించారు. మాజీ కౌన్సిలర్ పప్పు రాజారావు, 64వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు ధర్మాల శ్రీను, 73వ వార్డు కార్పొరేటర్ భూపతిరాజు సుజాత, డీసీసీబీ చైర్మన్ కోన తాతారావు, ఆలయ కమిటీ పెద్దలు నాయుడు, బాపిరాజు, నాగబాబు, రామ్మోహన్, సతీష్, కె.వీరాస్వామి, వానపల్లి జగ్గారావు తదితరులు పాల్గొన్నారు.

హోటల్స్ క్రికెట్ లీగ్ ప్రారంభం



పోటీలు ప్రారంభిస్తున్న హోటల్స్ సంఘం ప్రతినిధులు

విశాఖ స్పోర్ట్స్: ఆంధ్రప్రదేశ్ హోటల్స్ అండ్ రెస్టారెంట్స్ సంఘం (హెచ్ఆర్ఏపీ) ఆధ్వర్యంలో మున్సిపల్ స్టేడియంలో శుక్రవారం అంతర హోటల్స్ క్రికెట్ లీగ్ పోటీలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. ఈ టోర్నమెంట్‌లో మొత్తం 16 హోటల్ జట్లు పాల్గొంటున్నాయి. హోటల్స్ సంఘం అధ్యక్షుడు ప్రశాంత్ తొలి మ్యాచ్‌ను ప్రారంభించారు. హోటల్ సిబ్బంది మధ్య స్నేహపూరిత వాతావరణాన్ని, క్రీడాస్ఫూర్తిని పెంపొందించడమే ఈ పోటీల ఉద్దేశమని సంఘం ఉపాధ్యక్షుడు పవన్ కార్తీక్ ఈ సందర్భంగా తెలిపారు. స్టార్ కేటగిరీ హోటల్స్ మేనేజర్లు, హెచ్ఆర్ మేనేజర్లు పాల్గొన్నారు. టోర్నీలో భాగంగా తొలిరోజు మూడు మ్యాచ్‌లు జరిగాయి. మొదటి మ్యాచ్‌లో ది పార్క్ హోటల్ జట్టు అద్భుత ప్రదర్శన కనబరిచింది. మేఘాలయ హోటల్ నిర్దేశించిన 47 పరుగుల విజయ లక్ష్యాన్ని కేవలం 4.4ఓవర్లలో ఒక వికెట్ మాత్రమే కోల్పోయి సునాయాసంగా ఛేదించింది. రెండో మ్యాచ్‌లో రాక్‌డేల్ హోటల్ జట్టు నిర్ణీత ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి 104 పరుగులు చేసింది. ఐటీ ఫార్చ్యూన్ ఇన్ జట్టు తొమ్మిది వికెట్లు కోల్పోయి 91 పరుగులే చేసి ఓటమి పాలైంది. మూడో మ్యాచ్ ఏకపక్షంగా సాగింది. తొలుత బ్యాటింగ్ చేసిన పామ్ బీచ్ జట్టు కేవలం రెండు వికెట్లు కోల్పోయి 188 పరుగుల భారీ స్కోర్ సాధించింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన రాయల్ ఫోర్ట్ హోటల్ జట్టు ఏడు వికెట్లు కోల్పోయి 47 పరుగులు మాత్రమే చేయగలిగింది.

‘ఆపరేషన్ కగార్’ను నిలిపివేయాలి

సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ నేత వెంకటేశ్వర్లు



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ధర్నా చేస్తున్న ప్రజా సంఘాల, వివిధ పార్టీల నాయకులు

సీతమ్మధార: కేంద్ర ప్రభుత్వం చేపట్టిన కర్రెగుట్ట నిర్బంధాన్ని తక్షణమే విరమించి, మావోయిస్టుల ఏరివేత పేరుతో ప్రవేశపెట్టిన ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ విశాఖ, విజయనగరం జిల్లాల ఏరియా కమిటీ నేత ఎం.వెంకటేశ్వర్లు విజ్ఞప్తి చేశారు. సీపీఐ(ఎం.ఎల్) న్యూ డెమోక్రసీ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద వివిధ ప్రజా సంఘాలు, పార్టీలతో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీలను సమూలంగా నిర్మూలించి అటవీ సంపదను కార్పొరేట్లకు అప్పజెప్పే లక్ష్యంతో కేంద్ర బీజేపీ ప్రభుత్వం ఈ దమనకాండకు పాల్పడుతోందని ఆరోపించారు. తక్షణమే ఈ నరమేధాన్ని ఆపి మావోయిస్టు పార్టీతో శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. సీపీఐ నాయకులు పైడిరాజు మాట్లాడుతూ రాజమండ్రి నుంచి రాయ్‌పూర్ వరకు ఎనిమిది లైన్ల రహదారులను అందంగా వేస్తున్నది ప్రజల కోసం కాదని, కార్పొరేట్ల కోసమే అన్నారు. అంబానీ, అదానీ వంటి కార్పొరేట్ల సంతోషం కోసం అమాయక గిరిజనులందరినీ అణచివేసి, ఖనిజ సంపదను దోచిపెట్టడానికి కుట్రలు పన్నుతున్నారన్నారు. అందుకనే కశ్మీర్‌లో అధికరణ 370 రద్దు చేశారని, అలాగే మణిపూర్‌లో చిచ్చు పెట్టి.. ఇప్పుడు కర్రెగుట్టలో మొత్తం సైన్యాన్ని దించారని తెలిపారు. భవిష్యత్‌లో ప్రజా సంఘాల నేతలు, హక్కుల నేతలపై దాడి జరిగే అవకాశం ఉందని హెచ్చరించారు. ధర్నాలో పీవోడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు ఎం.లక్ష్మీ, సీపీఐ ఎంఎల్ ప్రజాపోరు నాయకులు దేవా, సీపీఎం నేత మణి, డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ధర్మేంద్ర, విద్యా పరిరక్షణ కమిటీ ప్రతినిధి కిశోర్, అరుణోదయ నిర్మల, న్యాయవాదులు కె.ఎస్.చలం, సురేష్, ఎంఎస్ఎస్ఎస్ పూర్వ అధ్యక్షుడు కె.రవి, తదితర సంఘాల నాయకులు పాల్గొన్నారు.

జాగరపు శ్రీనుకు యంగ్ ఇండియా సేవా పురస్కారం



పురస్కారం స్వీకరిస్తున్న శ్రీను

గాజువాక: గాజువాకలో రక్తదాన శిబిరాలు, వైద్య శిబిరాలతో పాటు వివిధ సేవలు అందిస్తున్న మహాత్మా మదర్ థెరిసా చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు జాగరపు శ్రీనుకు యంగ్ ఇండియా సేవా పురస్కారం లభించింది. తెలంగాణకు చెందిన యంగ్ ఇండియా బ్లడ్ డోనర్ క్లబ్ ప్రతినిధులు హైదరాబాద్‌లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని శ్రీనుకు ప్రదానం చేశారు. పురస్కారాన్ని స్ఫూర్తిగా తీసుకొని తన సేవలను మరింత విస్తృతం చేస్తానని ఈ సందర్భంగా శ్రీను పేర్కొన్నారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేకం

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాత లు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో కె. శోభారాణి తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ. 500 చెల్లించిన యెడల పూజకు దంపతులు లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891-2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శోభారాణి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

దాతల సహకారంతో సుభోజనం



హోమీబాబా ఆస్పత్రిలో సుభోజనం వడ్డిస్తున్న దాత అంకినీడు ప్రసాద్



భోజనం చేస్తున్న రోగుల సహాయకులు

అగనంపూడి: సుభోజనం కార్యక్రమం విజయవంతంగా కొనసాగించడానికి ముందుకు వస్తున్న దాతలకు హరేకృష్ణ మూమెంట్ అధ్యక్షుడు శ్రీమాన్ నిస్కించిన భక్తదాస అభినందనలు తెలిపారు. అగనంపూడి సమీపంలోని హోమీబాబా క్యాన్సర్ ఆస్పత్రి ఆవరణలో హరేకృష్ణ మూమెంట్, టచ్‌స్టోన్ చారిటీస్ సంయుక్తంగా సుభోజనం పేరుతో రోగులు, వారి సహాయకులకు మధ్యాహ్న భోజన వసతి కల్పించనున్నారు. ఈ కార్యక్రమం నేటి నుంచి ఏడాది పొడవునా కొనసాగించడానికి కృష్ణా జిల్లాకు చెందిన కోసూరు అంకినీడు ప్రసాద్ వారి పూర్వీకుల జ్ఞాపకార్థం అందించేందుకు అవసరమైన నిధులు సమకూర్చారు. ఈ సందర్భంగా భక్తదాస మాట్లాడుతూ దాతలు కార్యక్రమంలో భాగస్వాములు కావడం సంతోషంగా ఉందన్నారు. ప్రసాద్ ఉదారతకు కృతజ్ఞతలు తెలిపారు. వివాహ మహోత్సవం, ఇతర శుభ కార్యాల దినాల్లో భోజన సౌకర్యం ఏర్పాటు చేసేందుకు 96667 62108 నంబర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.

బాలికల భవిష్యత్ కోసమే కిశోర వికాసం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న అంగన్‌వాడీలు

పెదగంట్యాడ: యుక్త వయసులో ఉన్న బాలికల భవిష్యత్‌కు కిశోర వికాసం కార్యక్రమం ఎంతో దోహదపడుతుందని ప్రియదర్శినీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రం కార్యకర్త కృష్ణవేణి అన్నారు. జీవీఎంసీ 65వార్డు పరిధిలోని ప్రియదర్శిని కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం కిశోర వికాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్యం నుంచి యుక్త వయసులో ఉన్న బాలికల సంరక్షణపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. గుడ్- టచ్ బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పిస్తున్నామన్నారు. అనంతరం పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు కార్డన్ సెర్చ్



కార్డన్‌సెర్చ్‌కు సిద్ధమవుతున్న పోలీసులు



స్థానికులను ఆరా తీస్తున్న పోలీసులు



కల్లుపాకలు ప్రాంతంలో వాహనాలు తనిఖీ చేస్తున్న సీఐ ఎర్రంనాయుడు

అల్లిపురం: నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణకు కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నామని విశాఖ టూటౌన్ సీఐ వి.వి.సి.ఎం. ఎర్రంనాయుడు అన్నారు. ఈస్ట్ సబ్ డివిజన్ ఏసీపీ కె.లక్ష్మణమూర్తి ఆధ్వర్యంలో శుక్రవారం వేకువ జాము నుంచి పూర్ణామార్కెట్, కల్లుపాకలు తదితర ప్రాంతాల్లో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. సుమారు 50 మంది పోలీస్ సిబ్బంది చుట్టుముట్టడంతో ప్రజలు ఆందోళన చెందారు. పోలీసులు వివరాలు చెప్పడంతో వారంతా ఊపిరి పీల్చుకున్నారు. రౌడీషీటర్లు, అనుమానితుల ఇళ్లలో తనిఖీలు చేశారు. ఇంటింటికీ వెళ్లి కుటుంబ సభ్యుల వివరాలపై ఆరా తీశారు. తనిఖీలలో వాహనాలకు నంబర్ ప్లేట్ సరిగా లేని 11 వాహనాలపై కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు. యువత గంజాయి, మద్యం, గుట్కా వంటి వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. మద్యం తాగి వాహనాలు అతి వేగంగా, అజాగ్రత్తగా నడపవద్దని కోరారు. వీటితో కలిగే ప్రమాదాల కారణంగా ఎన్నో కుటుంబాలు రోడ్డున పడ్డాయని, డ్రంక్ అండ్ డ్రైవ్‌లో దొరికితే జరిమానాతో పాటు జైలు శిక్ష కూడా ఉంటుందన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని, ఒకవేళ ఇస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అనుమానిత వ్యక్తులు వస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. కాలనీల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, వాహనాలు నడిపేవారు అన్ని ధ్రువీకరణ పత్రాలు వెంట ఉంచుకోవాలని, సైబర్ క్రైం పట్ల అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర సమయంలో మహిళలు శక్తి యాప్ వినియోగించుకోవాలని, ఈ యాప్ మహిళల భద్రత కోసమే ప్రత్యేకంగా రూపొందించిందని సీఐ ఎర్రంనాయుడు తెలిపారు. ప్రజలంతా పోలీసులకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. టూటౌన్, మహారాణిపేట, త్రీటౌన్, ఫోర్త్ టౌన్ సిబ్బంది పాల్గొన్నారు.

పాతనగరంలో..

డాబాగార్డెన్స్: శుక్రవారం వన్‌టౌన్ పోలీసులు కేజీహెచ్‌కు ఆనుకుని ఉన్న వార్డుభాయి లేన్‌లో కార్డన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. అనుమానితులు ఉన్నారా? లేదా ఆరా తీస్తూ.. ఇంటింటిని తనిఖీ చేశారు. వాహనాల డాక్యుమెంట్లు పరిశీలించారు. అనుమానిత వ్యక్తుల సమాచారం సేకరించడం వంటి చర్యలు చేపట్టారు. తనిఖీలో అసాంఘిక కార్యకలాపాల్లో పాల్గొనే అవకాశం ఉన్న అనుమానితులను గుర్తించడానికి ప్రత్యేక దృష్టి పెట్టినట్టు వన్‌టౌన్ సీఐ జీడీ బాబు తెలిపారు. ఆపరేషన్‌లో ముగ్గురు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారణకు స్టేషన్‌కు తరలించారు. 11 మోటారు సైకిళ్లు స్వాధీనం చేసుకున్నారు. ఆపరేషన్‌లో వన్‌టౌన్ సీఐతో పాటు ఎస్సై లక్ష్మణ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
గాజువాక
9912222749, 9705347420, 9705933394
Office mail : sakshiadvtvsp@gmail.com